## క్లుప్తంగా

### డాక్టరేట్ ప్రదానం


కొండయ్య

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వవిద్యాలయం తెలుగుశాఖ స్కాలర్ మాలపాటి మలెంకొండయ్యకు విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. ఈయన తెలుగుశాఖ ఆచార్యులు ఎం.ఎం. వినోదిని పర్యవేక్షణలో ' ఆధునిక కవిత్వం – బహుజన చైతన్యం'లో పరిశోధన చేసి విశ్వవిద్యాలయానికి సమర్పించారు. ఉపకులపతి మార్గదర్శకత్వంలో నియమితులైన నిపుణుల బృందం మాలపాటి మలెంకొండయ్య సమర్పించిన థీసిస్‌ను పరిశీలించి డాక్టరేట్‌కు అర్హత ఉందంటూ నిర్ణయించారు. ఈ మేరకు ఆయనకు డాక్టరేట్ ప్రకటించారు.

### దరఖాస్తుల ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప నగరంలోని సంజీవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని ఫౌండేషన్ ప్రతినిధి బీవీ లక్ష్మిరెడ్డి తెలిపారు. టైలరింగ్, మగ్గం, బ్యూటీషియన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని, ఈనెల 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 96764 81208, 93464 31842 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

### అన్నదానం

కడప కోటిరెడ్డిసర్కిల్: నగరంలోని ప్రేమాలయ వృద్ధాశ్రమంలో శనివారం నిరాశ్రయులకు దాతలు అన్నదానం నిర్వహించారు. వెంకట రమణయ్య వర్ధంతిని పురస్కరించుకుని ఆయన కుటుంబ సభ్యులు జయలక్ష్మమ్మ, నాగసుబ్బయ్య, సుకన్యలు ఉదయ భాస్కర్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

### కంప్యూటర్లు అందజేత

కడప ఎడ్యుకేషన్: యోవీయూలోని కంప్యూటర్ సైన్స్ విభాగ పూర్వ విద్యార్థులు (2008–2011 బ్యాచ్) ఆ విభాగానికి లక్ష రూపాయలు విలువ చేసే 5 కంప్యూటర్లను వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య కృష్ణారెడ్డి విచ్చేసి పూర్వ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కులసచివులు ప్రొఫెసర్ పద్మ , ప్రొఫెసర్ రఘునాథరెడ్డి, ఆ విభాగ అధిపతి డాక్టర్ శ్రీనివాసరావు, అధ్యాపకులు డాక్టర్ బి . రెడ్డయ్య , పూర్వ విద్యార్థులు ప్రభాకర్ , గిరి , అనిల్ , అకడెమిక్ కన్సల్టెంట్స్ పాల్గొన్నారు.

### క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్‌ను ఏర్పాటు చేయాలి

కడప రూరల్: క్రైస్తవ సోదరుల సౌకర్యార్థం కడప నగరంలో క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కడప నగర పాస్టర్లు కోరారు. ఆ మేరకు శనివారం తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి నివాసంలో ఆయనకు వినతి పత్రం సమర్పించారు. అనంతరం పాస్టర్లు మల్లెం విజయభాస్కర్, కస్తూరి సుధాకర్, దేవన్న, డేవిడ్‌రాజు మాట్లాడుతూ ఇచ్చిన హామీ ప్రకారం క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్‌కు స్థల సేకరణతో పాటు నిర్మాణానికి అవసరమైన నిధులను కేటాయించాలని కోరారు. ఈ కమ్యూనిటీ హాల్ ఏర్పాటు వలన క్రైస్తవ సోదరులకు ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో పాస్టర్లు చార్లెస్, విజయ్‌కుమార్, రాజన్న, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# విజయదుర్గమ్మకు విశేష పూజలు


మహాపూర్ణాహుతి నిర్వహిస్తున్న భక్తులు, పండితులు


ముగింపు కార్యక్రమాల్లో భాగంగా కళాకారుల ప్రదర్శన

కడప కల్చరల్: కడప నగరంలోని శ్రీ విజయ దుర్గాదేవి వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ముగిశాయి. ఉత్సవాలలో భాగంగా ఆలయంలో అమ్మవారికి పుష్పయాగం నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా తొలుత యాగ మండపంలో మహాపూర్ణాహుతి కార్యక్రమాన్ని ఆలయ వ్యవస్థాపకులు మల్లికార్జున రావు కుటుంబ సభ్యులతో కలిసి ఘనంగా నిర్వహించారు. సాయంత్రం ఆలయంలోని ధ్వజస్తంభం వద్ద ధ్వజావరోహణం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం అర్చకులు, నిర్వాహకులు అమ్మవారి కోనేరులో త్రిశూలంతో దిగి స్నానం ఆచరింపజేశారు.

## శిల్పారామం అభివృద్ధికి ప్రత్యేక చర్యలు


శిల్పారామాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర శిల్పారామాల చైర్ పర్సన్ మంజులారెడ్డి

కడప కల్చరల్: కడప శిల్పారామాన్ని పూర్తిగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు రాష్ట్ర శిల్పారామాల చైర్ పర్సన్ మంజులారెడ్డి అన్నారు. శనివారం ఆమె కడప శిల్పారామాన్ని సందర్శించారు. ఏఓ శివప్రసాద్‌రెడ్డి, సూపర్‌వైజర్ మధుసూదన్‌బాబు, ఇతర సిబ్బంది ఆమెకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె బోటింగ్ పాండ్, మెయిన్ ఎంట్రన్స్ గేట్లు, స్క్రాప్ కల్చర్ పార్క్ ఏరియా, గేమ్ జోన్ ఏరియా, పార్కింగ్ ఏరియాలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కడప శిల్పారామం మిగతా అన్నింటికంటే ఎక్కువ ఆదాయాన్ని రాబడుతోంది గనుక దీనిని మరింత అభివృద్ధి చేసి ఎక్కువ ఆదాయాన్ని పొందేందుకు కృషి చేస్తామన్నారు. అవసరమైన అన్ని రకాల వసతులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అలాగే పబ్లిక్, ప్రైవేటు పార్టిసిపేషన్ (పీపీటీ) పద్ధతిలో అభివృద్ధి చేసేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. పిల్లల కోసం కొత్త ఆటలకు అవకాశం కల్పిస్తామన్నారు. ముఖ్యంగా చేతి వృత్తుల వారికి ఉత్పత్తులను విక్రయించుకునేందుకు స్టాల్స్‌ను తక్కువ ధరకు అంటే రూ. 1430లకు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇక్కడి పరిస్థితులను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి శిల్పారామానికి ప్రత్యేకమైన నిధులను తెచ్చి అభివృద్ధి చేసేందుకు ప్రయత్నిస్తామన్నారు.

### ఆర్టీసీ డ్రైవర్‌పై దౌర్జన్యం

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప నుంచి ప్రొద్దుటూరుకు వెళుతున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్‌ను ఆలంఖాన్‌పల్లె వద్ద అడ్డుకుని దౌర్జన్యకరంగా వ్యవహరిస్తూ దుర్భాషలాడిన ఘటన శనివారం చోటుచేసుకుంది. బస్సు హారన్ కొట్టాడని ఆర్టీసీ బస్సు డ్రైవర్‌ను బెదిరిస్తూ మా కారునే పక్కకు తప్పుకోమంటావా అంటూ ఓ వ్యక్తి వీరంగం సృష్టించాడు. డ్రైవర్‌ను బస్సు నుంచి కిందికి దింపి మేము ఎవరో మీకు తెలుసా అంటూ దుర్భాషకు దిగాడు. దీంతో అక్కడికి చేరుకున్న జనాన్ని చూసి దౌర్జన్యకారుడు అక్కడికి నుంచి తాపీగా జారుకున్నాడు.

## ఏపీజీబీ కడపలోనే కొనసాగించాలి

కడప సెవెన్‌రోడ్స్: ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలని ఏఐసీసీ కో ఆర్డినేటర్ ఎస్‌ఏ సత్తార్ కోరారు. శనివారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. కేంద్ర ఆర్థికశాఖ మార్గదర్శకాల మేరకు ఏపీజీబీ ప్రధాన కార్యాలయం కడపలోనే కొనసాగించాల్సి ఉందన్నారు. రాయలసీమ ప్రజల ప్రగతికి అవసరమైన ఆర్థిక సేవల కోసం ఆ బ్యాంకు ఇక్కడే ఉండాలని, అమరావతికి తరలించడం తగదన్నారు. ఇప్పటికే కొప్పర్తిలోని ఎంఎస్‌ఎంఈ టెక్నాలజీ సెంటర్‌ను అమరావతికి తరలించారని, ఇప్పుడు ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని కూడా తరలించాలనుకోవడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కదిరి ప్రసాద్, హమీద్, ఆసిఫ్‌ఖాన్, శ్యామలాదేవి, రత్న, కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్: పోలీసు సిబ్బంది తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శనివారం ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఎస్పీ కార్యాలయం వద్ద 'స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమాన్ని పోలీసులు చేపట్టారు.

**డీపీఆర్‌సీ ఆవరణలో స్వచ్ఛభారత్**

కడప సెవెన్‌రోడ్స్: జెడ్పీ కార్యాలయం వద్దగల జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం ఆవరణలో స్వచ్ఛభారత్ నిర్వహించారు. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నాగభూషణం, డీటీఎం సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**వైవీయూలో స్వచ్ఛ ఆంధ్ర**

కడప ఎడ్యుకేషన్: స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని శనివారం వైవీయూలో నిర్వహించారు. వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డి, ప్రధాన ఆచార్యులు ప్రొఫెసర్ ఎస్ రఘునాథరెడ్డి, కులసచివులు ఆచార్య పి పద్మ, ప్రొద్దుటూరు వైయస్సార్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య జయరామిరెడ్డి విద్యార్థులతో కలిసి శ్రమదానం చేశారు.

**ఆర్టీసీ అధికారుల స్వచ్ఛభారత్**

కడప కోటిరెడ్డిసర్కిల్: ఆర్టీసీ బస్టాండు, గ్యారేజీ పరిసర ప్రాంతాల్లో అధికారులు, సిబ్బంది స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్ఎం గోపాల్ రెడ్డి, డీఎం డిల్లీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### ఇంటింటా న్యాయ ప్రచారం ప్రయోజనకరం


ఇంటింటా న్యాయ ప్రచారంలో పాల్గొన్న ఏఎన్ఎం, ఆశా, అంగన్వాడీ, వైద్య సిబ్బంది బృందం

కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లాలో కొనసాగుతున్న ఇంటింటా న్యాయ ప్రచారం కార్యక్రమం ఎంతో ప్రయోజనకరమని వైద్య బృందం ప్రతినిధులు సూచించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి, సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్ ఆదేశాల మేరకు శనివారం జిల్లాలో పర్యటించి 4796 గృహాలను సందర్శించి 76 మంది ఎదుగుదలలోపాలు ఉన్న పిల్లలను గుర్తించారు. దివ్యాంగజన్ హెల్ప్‌లైన్ నెంబరు 14456ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పారా లీగల్ వలంటీర్లు, ఏఎన్ఎం ,ఆశా, అంగన్వాడీ వర్కర్లు, వైద్యాధికారులు, భవిత కేంద్రం నిర్వాహకులు పాల్గొన్నారు.

### నూతన వధూవరులకు ఆశీర్వాదం

చింతకొమ్మదిన్నె: ఇప్పపెంట ఎంపీటీసీ సభ్యుడు నారే నాగరాజు కుమారుడి వివాహ రిసెప్షన్ వేడుక శనివారం రాత్రి స్థానిక జయరాజ్ గార్డెన్స్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు, కమలాపురం మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి నూతన వధూవరులు చెన్నకృష్ణ, సాయి తేజస్వినిలను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



# కడప నగరమంతా కల్యాణ శోభ

కడప కల్చరల్: ఏ వీధిలోకి వెళ్లినా సన్నాయి రాగాలు...ఏ కల్యాణ మండపం చూసినా పెళ్లి కళ....ఏ ఆలయంలోకి వెళ్లినా వివాహాల సందడి....మార్కెట్లలో వ్యాపార దుకాణాలు, సముదాయాల ప్రారంభోత్సవాలు...నూతన నిర్మాణాలకు శ్రీకారం...వెరసి కడప నగరమంతా కల్యాణ శోభతో కళకళలాడుతోంది. ఇటీవల కొద్దికాలంపాటు ముహూర్తాలు లేకపోవడంతో అప్పట్లో కుదుర్చుకున్న సంబంధాలు పెళ్లిళ్ల మాసంగా పేరుగాంచిన మాఘమాసంలో బంధాన్ని బలపరుచుకుంటూ ఒక్కటవుతున్నాయి. ఈ మాసంలో వివాహ ముహూర్తాలు ఎక్కువగానే ఉన్నా ఆ తర్వాత మళ్లీ కొద్ది కాలం ఆగాల్సిన అవసరం ఉంటుందన్న అనుమానంతో పెద్దలు ఉన్నంతలో పిల్లల వివాహాలు కానిచ్చేస్తున్నారు. అందుబాటులో ఉన్న కల్యాణ మండపాలు మాట్లాడుకుని తమ శక్తికొద్ది ఇతర ఏర్పాట్లు చేసుకుని ఓపిగ్గా బంధుమిత్రులను ఆహ్వానించి ఆ ముచ్చట కానిచ్చేస్తున్నారు. దీంతో వివాహాల సీజన్ మొదలైనట్లు భావించాలి.

- మిగతా అన్ని మాసాలకంటే శుభకార్యాలు చేసుకునేందుకు శ్రావణమాసం తర్వాత పవిత్రమైన రోజులుండేది మాఘమాసంలోనే. వివాహాలకు ఈ మాసాన్ని అత్యంత శ్రేష్ఠమైనదిగా కూడా భావిస్తారు. ఇతర అన్ని శుభకార్యాల ప్రారంభం కూడా ఈ రోజుల్లోనే నిర్వహిస్తారు. నగరంలో గతం కంటే ఎక్కువ వివాహాలు ప్రస్తుతం జరుగుతున్నాయి.

### మండపాలన్నీ బిజీబిజీ

కడప నగరంలో వందకు పైగా చిన్న, పెద్ద కల్యాణ మండపాలు ఉన్నా దాదాపు ఈ మాసమంతా అన్నీ బిజీగానే ఉన్నాయి. ఒక వివాహానికిగాను రూ. 25 వేల మొదలుకొని రూ. 2 లక్షల వరకు మండపాలకు చెల్లించాల్సి వస్తుంది. ఇవి కాకుండా ఆయా కల్యాణ మండపాలకు తగినట్లు అలంకారాలు చేయాల్సి వస్తోంది. ఇందుకోసం ప్రత్యేకమైన బృందాలు ఆ కల్యాణ మండపాలలోనే అందుబాటులో ఉంటున్నారు. ఒక్కో పెళ్లికి రూ. 30 వేలు నుంచి రూ. 2 లక్షల వరకు అలంకారం కోసం వెచ్చించాల్సి వస్తోంది. కల్యాణ మండపాల స్థాయిలో అలంకారాలకు కూడా ఖర్చు చేయాల్సిన స్థితి నెలకొంది.


డీఎస్ఆర్ ఫంక్షన్ హాల్

### మార్కెట్లలో కొనుగోలు సందడి

పెళ్లిళ్ల సీజన్ నేపథ్యంలో కడప నగరంలోని ప్రధాన మార్కెట్ వైవీ స్ట్రీట్ రద్దీగా మారింది. ప్రధానంగా వస్త్ర దుకాణాలు, ఆ తర్వాత బంగారు నగల దుకాణాలు ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు సందడిగానే కనిపిస్తున్నాయి. బంగారం ధర ఆకాశాన్ని అంటుతున్నా అవసరం గనుక తల్లిదండ్రులకు కొనక తప్పడం లేదు. ఇందులో బంధుమిత్రుల సహకారం తీసుకుని అన్ని జాగ్రత్తలు పాటిస్తూ బంగారం కొనుగోలు చేస్తున్నారు. భారీ బంగారం కార్పొరేట్ దుకాణాలు వచ్చినా చిన్న దుకాణాలలో కూడా వ్యాపారాలు బాగానే జరుగుతున్నట్లు సమాచారం. మరికొందరు తమకు కావాల్సిన డిజైన్లు, ఇతర సరంజామాతో నగలను స్వయంగా తయారు చేయించుకుంటున్నారు. వైవీ స్ట్రీట్‌లోని దాదాపు చిన్న, పెద్ద అన్ని దుకాణాలు రోజంతా బిజీగానే కనిపిస్తున్నాయి. వస్త్ర దుకాణాల్లో ప్రధానంగా షాపింగ్‌మాల్స్ కిటకిటలాడుతున్నాయి. ఎక్కువగా రెడీమేడ్ వ్యాపారాలు జరుగుతున్నా మహిళల కళల పంటగా ఉండే పట్టు వస్త్రాల కొనుగోలు కూడా జోరుగా సాగుతోంది. మార్కెట్‌లో పలు వస్త్ర దుకాణాల్లో పట్టు చీరల విభాగం ప్రత్యేకించి పెళ్లి పట్టుచీరల విభాగాలు కూడా ఏర్పాటు చేశారు.

**అన్ని రంగాలకు ఆదరవుగా...**

వివాహమంటే పలు రంగాలు, వర్గాల వారికి ఆదరవు లభించినట్లే. కల్యాణ మండపాల సిబ్బంది నుంచి పురోహితులు, అలంకారాలు, బ్యాండు కళాకారులు, వంట బృందాలు, ఫోటో, వీడియోగ్రఫీ విభాగం, బ్యూటీ పార్లర్ విభాగం, ఆర్కెస్ట్రా నృత్యం విభాగాలు, ట్రావెలింగ్ ఏజెన్సీల వారికి చేతినిండా పని లభిస్తోంది.

**ఘాటెక్కిన పూల ధర**

వివాహాలలో పూలకు కూడా మంచి డిమాండ్ ఉంటోంది. జిల్లాలోనే పలు రకాల పూలు పండుతున్నా కోతలు, పెట్టుబడి, రవాణా, రీటైల్ తదితర ఖర్చులు కలుపుకుని ధర మండుతోంది. చామంతి పూలు కూడా కిలో రూ. 400 పలుకుతున్నాయి. వివాహాల మండపాలకు ప్రత్యేకించి బెంగుళూరు నుంచి పూలు తెప్పిస్తున్నారు.

## దివ్యాంగులకు సేవ చేయడం అదృష్టం


కేశవరెడ్డి దంపతులను సన్మానిస్తున్న సమగ్రశిక్ష సిబ్బంది, భవిత రిసోర్సు పర్సన్స్

కడప ఎడ్యుకేషన్: దివ్యాంగులకు సేవ చేయడం ఒక అదృష్టమని సమగ్ర శిక్ష పథక సంచాలకులు నిత్యానందరాజు పేర్కొన్నారు. శనివారం కడపలోని ప్రెస్ క్లబ్‌లో సహిత విద్యా సమన్వయకర్తగా పనిచేసి బదిలీపై వెళ్లిన కేశవరెడ్డికి సహిత విద్య రిసోర్స్ పర్సన్లు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులకు సేవ చేయాలంటే ఎంతో ఓర్పు, నేర్పు ఉండాలన్నారు. ఆ విభాగంలో కేశవరెడ్డి దాదాపు 5 సంవత్సరాలు సమన్వయకర్తగా పనిచేసి అందరి మన్ననలు పొందడం మామూలు విషయం కాదన్నారు. సెక్టోరల్ అధికారులు విశ్వనాథరెడ్డి, వీరేంద్ర, రమణమూర్తి, లక్ష్మినరసింహరాజు, వివిధ మండలాల భవిత రిసోర్స్ పర్సన్లు మమత, రవి, కరుణాకర్, విజయమ్మ, యశోద, కళావతి, రాంబాబు, పాలేటి తదితరులు మాట్లాడారు. అనంతరం సన్మాన గ్రహీత కేశవరెడ్డి మాట్లాడుతూ దివ్యాంగుల సమస్యలు ఉత్కృష్టమైనవని అన్నారు. వారికి సేవ చేసే భాగ్యం కలిగినందుకు ధన్యుడను అన్నారు. అనంతరం కేశవరెడ్డి దంపతులకు వారు ఘనంగా సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో నిత్యానందరాజు ఆంధ్ర ప్రదేశ్ భవిత స్పెషల్ ఎడ్యుకేటర్స్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

### ముంపు బాధితులకు పరిహారం చెల్లింపులో జాప్యం

కడప కార్పొరేషన్: సోమశిల ముంపు బాధితులకు నష్ట పరిహారం చెల్లింపులో అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారని అట్లూరు మండలం వేములూరుకు చెందిన నరసింహులు ఆరోపించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అనర్హులకు నష్టపరిహారం ముందుగా చెల్లిస్తూ.. అర్హులైన తమను నీట ముంచుతున్నారని విమర్శించారు. 2002 నుంచి సోమశిల ముంపు ప్రాంతాల అవార్డు మేరకు నష్టపరిహారం ఇస్తారని ఎదురు చూస్తున్నామని, అయితే ఇటీవల అర్హతలేని గుట్టపైన ఉన్న వాటికి నష్ట పరిహారం చెల్లించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం తమకు ఆవేదన కలిగిస్తోందన్నారు. ఇప్పటికైనా అసలైన ముంపు బాధితులకు నష్ట పరిహారం ఇవ్వాలని కోరారు.